నీటి మత్తడులు

మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అల్లీపూర్ గ్రామ శివారులోని ఊకచెట్టు వాగుపై 2019లో రూ.5.12 కోట్లతో నాటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కృషితో చెక్‌డ్యాం నిర్మించగా నీటితో కళకళలాడింది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర నీరు నిలిచి ఉండేది. వాగు పరిసరాల్లోని పిన్నంచర్ల, ఉంద్యాల, మదనాపురం మండలంలోని దుప్పల్లితోపాటు ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు పుల్‌గా ఉండేవి. బోర్లు నిండుగా పోసేవి. దాదాపు రెండు పంటలకు నీరు అందడంతో చెక్‌డ్యాం పరిధిలో 12 ఎకరాలు సాగయ్యేది. రైతులు ఆర్థికంగా ఎదగడంతో వారి కుటుంబాలు సంతోషంగా జీవించాయి.

ఇసుక మేటలు

నాడు జలకళను సంతరించుకున్న చెక్‌డ్యాం నేడు నీరులేక వెలవెలబోతున్నది. ఎక్కడ చూసినా ఇసుక మేటలే కనిపిస్తున్నాయి. సమీప పొలాల్లోని బోర్లల్లో నీటి మట్టం తగ్గిపోయింది. కొన్ని బోర్లు ఒట్టిపోయాయి. వాగు సమీప గ్రామాల్లో నీటి ఎద్దడి మొదలైంది. భూములన్నీ బీళ్లుగా మారాయి. నాడు ఎక్కడ చూసినా పచ్చని మాగాణి కనిపిస్తే నేడు బోసిపోయిన పొలాలే దర్శనమిస్తున్నాయి.

– బందిగె గోపి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

వడ్ల స్కాం 1100 కోట్లు

మొదటిపేజీ తరువాయి...

ప్రమేయం కూడా ఉన్నదని ఆరోపించారు. ధాన్యం సేకరణపై దృష్టిపెట్టకుండా సేకరించిన ధాన్యంపై కన్ను వేసి ఈ స్కాంకి, అవినీతి చీకటి దందాకు తెరలేపారని వెల్లడించారు.

ఒకే రోజు కమిటీ, మార్గదర్శకాలు, టెండర్లు?

రూ.1,100 కోట్ల కుంభకోణానికి సంబంధించి జనవరి 25న కమిటీ వేసి, అదే రోజున కమిటీ ఏర్పాటు చేసి, అదే రోజు మార్గదర్శకాలు విడుదల చేసి, అదే రోజున కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లను పిలిచిందని కేటీఆర్ తెలిపారు. ఇచ్చిన హామీల అమలులోలేని ఈ జెట్ స్పీడ్..అవినీతి సొమ్ము పొందేందుకు కాంగ్రెస్ పెద్దలు చూపించారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో సేకరించిన రూ.7 వేల కోట్ల విలువ చేసే ధాన్యం నిల్వలపై కాంగ్రెస్ ప్రభుత్వం కన్నేసిందని, 35 లక్షల టన్నుల ధాన్యం అమ్మకం కోసం గ్లోబల్ టెండర్ల పేరుతో రూ.700 కోట్ల నుంచి రూ.800 కోట్ల వరకు స్కాం జరిగిందని, మధ్యాహ్న భోజన పథకం కోసం 2.20 లక్షల టన్నుల సన్నబియ్యం కొనుగోలు కోసం రూ.300 కోట్లకు రెండో కుంభకోణం జరిగిందని వివరించారు. ధాన్యానికి క్వింటాలుకు రూ.2,100 చొప్పున స్థానిక మిల్లర్లు కొంటామని చెప్పినా.. వారికి ఇవ్వకుండా నిబంధనలో మార్పులుచేసి గ్లోబల్ టెండర్ల పేరుతో కుట్రకు తెరలేపారని వెల్లడించారు. ఈ టెండర్లను కేంద్రియ భండార్, ఎల్జీ ఇండస్ట్రీస్, హిందుస్థాన్ కంపెనీ, నాకాఫ్ సంస్థలు దక్కించుకున్నాయని తెలిపారు. ఈ సంస్థల్లో కేంద్రియ భండార్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో పెడితే ఆ సంస్థకు నిబంధనల్లో మినహాయింపు ఇచ్చి టెండర్ దక్కించుకునేలా కాంగ్రెస్ పెద్దలు చేశారని పేర్కొన్నారు.

మనీ లాండరింగ్‌లో 4 కాంట్రాక్టు సంస్థలు

గ్లోబల్ టెండర్లలో భాగంగా క్వింటాలుకు రూ.1,885 నుంచి రూ.2,007కు కోట్‌చేసి కేంద్రియ భండార్, ఎల్జీ ఇండస్ట్రీస్, హిందుస్థాన్ కంపెనీ, నాకాఫ్ సంస్థలు టెండర్లు దక్కించుకున్నాయని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వ పెద్దలే కావాలని తక్కువగా గ్లోబల్ టెండర్లు పిలిచి కట్టబెట్టారని వెల్లడించారు. అయితే నాలుగు సంస్థలు గోదాముల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని తీసుకెళ్లకుండా, మిల్లర్లను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయని ఆరోపించారు. క్వింటాలుకు రూ.2,230 తమకు చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 4 వేల రైస్‌మిల్లర్లను ఈ కాంట్రాక్ట్ సంస్థలు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయని తెలిపారు. బలవంతంగా వసూళ్లకు పాల్పడుతూ మనీలాండరింగ్ చేస్తున్నాయని అన్నారు.ఇందుకు సదరు కాంట్రాక్ట్ సంస్థలు.. 'సీఎం పేషీకి ఖర్చయిందట.. ఢిల్లీ ఏఐసీసీ పెద్దలకు వాటాలు పంపించారట.. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖజానా నింపారట.. అందుకే క్వింటాలుకు కనీసం రూ.150 వరకు అదనంగా కలిపి చెల్లించాలి' అని రైస్‌మిల్లర్లపై ఒత్తిడి తెస్తున్నాయని చెప్పారు. ఈ మేరకు అదనపుగా డబ్బులు ఇవ్వకపోతే సివిల్ సప్లై శాఖ, విజిలెన్స్ శాఖలతో కేసులు పెట్టిస్తామని భయపెడుతున్నాయని వివరించారు.

35 లక్షల టన్నుల్లో 800 కోట్ల అవినీతి

ధాన్యం సేకరించాల్సిన సంస్థలతో ప్రభుత్వ పెద్దలు నగదు వసూలు చేయించటం విడ్డూరంగా ఉందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 35 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు కనీసం రూ.200 చొప్పున అదనంగా వసులుచేసినా అది రూ.700 కోట్ల నుంచి రూ.800 కోట్ల చేరుకున్నదని వివరించారు. ధాన్యం కొనుగోలుకు టెండర్లు వేసిన ఈ సంస్థలు మిల్లర్ల నుంచి డబ్బులు ఎట్లా వసూలు చేస్తున్నాయని ప్రశ్నించారు. మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేసే అధికారం ప్రైవేటు సంస్థలకు ఎవరిచ్చారని నిలదీశారు. గడువు ముగిసినా, వాటిని బ్లాక్ లిస్టులో పెట్టకుండా తమ డబ్బుల కోసం వారికి మరింత గడువు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎందుకు ప్రయత్నం చేస్తున్నదని ప్రశ్నించారు. ఆ సంస్థలకు మరింత గడువు ఇస్తే రూ.150 కోట్ల వడ్డీని నష్టం కింద సివిల్ సప్లై కార్పొరేషన్ అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి వస్తుందని వెల్లడించారు.

ఎఫ్‌సీఐ ఎందుకు స్పందించడం లేదు?

ఈ మొత్తం వ్యవహారంలో రేవంత్‌రెడ్డి పాత్ర కూడా ఉండే అవకాశం ఉన్నదని, ప్రభుత్వంలో సీఎం ఆదేశాలు, అనుమతి లేకుండా ఏమీ జరగదు అనే విషయం అందరికీ తెలుసని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీ పెద్దల దాకా అనేకమంది హస్తం ఉన్నదన్న అనుమానం వ్యక్తం చేశారు. ఈ స్కాంలో బీజేపీ పాత్ర కూడా అనుమానాస్పదంగా ఉన్నదని విమర్శించారు. రాష్ట్రంలో జరిగే ధాన్యం సేకరణ, కనీసం మద్దతు ధర అమలు, బియ్యం సేకరణ ఇలా అన్ని అంశాలు కేంద్ర ప్రభుత్వంలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధీనంలోనే జరుగుతాయని, తెలంగాణ బీజేపీ శాసనసభాపక్ష నేతనే స్వయంగా అవినీతి జరిగిందని చెప్పున్నా కేంద్రం, ఎఫ్‌సీఐ ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. వెంటనే ఈడీ, సీబీ సంస్థల విచారణకు ఆదేశించాలని ఎఫ్‌సీఐని డిమాండ్ చేశారు.

తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

సన్నబియ్యం కొనుగోలులో 300 కోట్లు

పేద విద్యార్థుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించిందని, దీన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి వాడుకుంటుందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అవసరాల కోసం సేకరించాల్సిన 2.20 లక్షల సన్నబియ్యం కొనుగోలులో రూ.300 కోట్ల అవినీతికి తెరలేపిందని ఆరోపించారు. రాష్ట్రంలో రూ.40 నుంచి రూ.45కు కొత్త సన్నబియ్యం అందుబాటులో ఉంటే రూ.57 కిలో చొప్పున కొంటున్నదని తెలిపారు. సన్నబియ్యం కొనుగోలుకు కూడా గ్లోబల్ టెండర్ కుట్రకు లేపిందని, ఆ టెండర్లను దక్కించుకున్నది కూడా అవే కేంద్రియ భండార్, ఎల్జీ ఇండస్ట్రీస్, హిందుస్థాన్ కంపెనీ, నాకాఫ్ సంస్థలు అని కేటీఆర్ వెల్లడించారు. ఈ నాలుగు సంస్థలు కుమ్మక్కై ఒకే ధరకు టెండర్ వేశాయని తెలిపారు. గత ప్రభుత్వం సేకరించిన ధాన్యంలో 1.60 లక్షల టన్నుల సన్నబియ్యం ఉంటే.. వాటిని రూ.22కు అమ్మి, ఈ నాలుగు సంస్థల ద్వారా కిలోకి రూ.57 చొప్పున కొంటున్నదని వివరించారు. ఇది అవినీతి కాకపోతే ఇంకేంటి? అని ప్రశ్నించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించు రేవంత్

రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఈ రెండు టెండర్ల వ్యవహారంలో సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ అంశంలో చిత్తశుద్ధి ఉంటే రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడాలని సవాల్ విసిరారు. కేంద్రం, ఎఫ్‌సీఐ, రాష్ట్రప్రభుత్వం స్పందించకుంటే ఈ వ్యవహారాన్ని వదిలిపెట్టబోమని, విచారణ సంస్థల దగ్గరకు వెళ్తామని, న్యాయపరంగా కేసులు వేసి దోషులను ప్రజల ముందు నిలబెడతామని, ప్రజా కోర్టులోనూ ఎండగడతామని హెచ్చరించారు. వీటన్నింటికంటే ముందుగా 90 రోజుల టెండర్ గడువు ముగిసిన తర్వాత కూడా ధాన్యం సేకరించని సంస్థలపై తీసుకున్న చర్యలు ఏమిటో శ్వేతపత్రం రూపంలో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్

మొదటిపేజీ తరువాయి...

పాల్గొంటున్నారు. పోలింగ్ సిబ్బందికి ఆదివారం ఎన్నికల సామగ్రి అందించి ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపించారు. ఒక పోలింగ్ కేంద్రంలో సగటున 800 మంది ఓటు హక్కు వినియోగించుకునే విధంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పట్టణాలు, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పోలింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. 283 పోలింగ్ కేంద్రాల్లో 800 మంది కంటే ఎక్కువగా ఓటర్లు ఉన్నారు. మొదట 600 పోలింగ్ కేంద్రాలే ఏర్పాటు చేయాలనుకున్నా.. భూపాలపల్లి జిల్లాలో మూడు, ములుగు జిల్లాల్లో రెండు పోలింగ్ కేంద్రాలను మారుమూల ప్రాంతాల ఓటర్ల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలో నోటా ఆప్షన్ ఉండదు. వచ్చే నెల 5న నల్లగొండ జిల్లా కేంద్రంలో ఓట్లను లెక్కించనున్నారు. ఎన్నికల ప్రశాంత నిర్వహణకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటర్లుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సోమవారం స్పెషల్ క్యాజువల్ లీవ్‌గా ఎన్నికల కమిషన్ మంజూరు చేసింది. ప్రైవేటు సంస్థలు, కార్యాలయాల్లో పనిచేసే వారు ఓటు హక్కు వినియోగించుకునేలా పనివేళల్లో వెసులుబాటు కల్పించాలని ఆయా సంస్థలకు సూచించింది.

మొత్తం ఓటర్లు	4,63,839
పురుషులు	2,88,189
మహిళలు	1,75,645
ట్రాన్స్‌జెండర్లు	5
పోలింగ్ స్టేషన్లు	605

ఓటర్లకు ముఖ్య సూచనలు

- బరిలో మొత్తం 52 మంది అభ్యర్థులు ఉన్నారు. ఒక ఓటరు ప్రాధాన్య క్రమంలో అందరికీ ఓటు వేసే అవకాశం ఉంటుంది.
- ప్రాధాన్యత ఓటును ఎన్నికల సంఘం ఇచ్చే వాయిలెట్ స్కెచ్ పెన్‌తో మార్క్ చేయాల్సి ఉంటుంది.
- మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన తర్వాతే మిగతా ప్రాధాన్యత ఓట్లు వేయాలి.
- మొదటి ప్రాధాన్యత ఓటు వేయకపోతే ఆ ఓటు చెల్లదు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్ కుమార్ వ్యాస్ అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులతో ఆదివారం ప్రత్యేకంగా సమీక్షించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల సీఈవోలు తమ రాష్ట్రాల్లో తీసుకున్న చర్యలను వివరించారు. కౌంటింగ్‌కు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఈవో వికాస్‌రాజ్ ఈ సందర్భంగా తెలిపారు. కౌంటింగ్ అధికారులకు మొదటి రౌండ్ శిక్షణ మంగళవారం పూర్తవుతుందని వెల్లడించారు. ఈసీఐ ద్వారా 47 మంది పరిశీలకులను రాష్ట్రానికి పంపిస్తున్నట్టు డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ వ్యాస్ తెలియజేశారు. సమావేశంలో అదనపు సీఈవో డీఎస్ లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవోలు పాల్గొన్నారు.

'కోడ్'ముసుగు.. 'భరోసా'కు ఎసరు!

- ధరణి స్పెషల్ డ్రైవ్ నిలిపివేత
- పెట్టుబడి సాయం భారం తప్పించుకునే ప్రయత్నమా?
- రైతుల్లో అనుమానాలు

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టిన 'స్పెషల్ డ్రైవ్'ను ప్రభుత్వం నిలిపివేయడంపై రైతుల్లో అనుమానాలు తలెత్తుతున్నాయి. రైతు భరోసా పేరిట అందించే పెట్టుబడి సాయం నుంచి తప్పించుకునేందుకే ఇలా చేసిందన్న విమర్శలు వస్తున్నాయి.మొత్తం 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరిస్తే దాదాపు 2లక్షల ఎకరాలకు అదనంగా రైతుభరోసా వేయాల్సి వస్తుందని అధికారులు అంచనా వేసినట్టు తెలిసింది. ఎకరాకు రూ.7,500 చొప్పున దాదాపు రూ.150 కోట్లు అదనపు భారం పడుతుందని తేల్చినట్టు సమాచారం. ఎన్నికల సమయంలో దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ అని ఆశ పెట్టి ఇప్పుడు ఎన్నికల కోడ్‌ను బూచిగా చూపి రైతు భరోసాను ప్రభుత్వం ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయిన రైతులు, సోమవారంతో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కూడా ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అనుమతి తీసుకొని పరిష్కరిస్తుందా? అని ఎదురుచూస్తున్నారు.

'ఆన్‌గోయింగ్'ను ఎందుకు ఆపేశారు?

మార్చి 1 నుంచి ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. పెండింగ్ దరఖాస్తులను తొమ్మిది రోజుల్లోగా పరిష్కరిస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదిక వచ్చిన తర్వాత రికార్డుల్లో మార్పులు, చేర్పులు చేసే అధికారాన్ని తాసిల్దార్లకు అప్పగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కానీ పోర్టల్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో ఇదంతా తూతూమంత్రం వ్యవహారమని నిపుణులు పెదవి విరిచారు. దానికి తగ్గట్టే ప్రభుత్వం రెండు వారాలపాటు స్పెషల్ డ్రైవ్ కొనసాగించి, ఎన్నికల కోడ్ పేరుతో దరఖాస్తుల పరిశీలన ఆపేసింది. రెండు వారాల్లో ఒక్క దరఖాస్తును కూడా పరిష్కరించలేదు. వాస్తవానికి ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం అనేది మొదటి నుంచీ ఉన్న ప్రక్రియ. పోర్టల్ ప్రారంభమైన కొన్ని రోజులకే గ్రీవెన్స్ మాడ్యూల్స్ అందుబాటులోకి వచ్చాయి. అధికారులు దరఖాస్తులను పరిశీలించి వాటిని పరిష్కరిస్తున్నారు. కాబట్టి ఇది 'ఆన్‌గోయింగ్' కార్యక్రమం కిందే లెక్కనినిపుణులు వాదిస్తున్నారు. రెవెన్యూ అధికారులు వినకుండా 'కోడ్' పేరుతో దరఖాస్తుల పరిశీలన నిలిపివేశారు. ఇటీవల రెవెన్యూ ఉన్నతాధికారులతో ధరణి కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఇదే విషయంపై కొంత వాగ్వాదం జరగగా.. మాకు కూడా కొన్ని పరిమితులు ఉంటాయి' అని అధికారులు చెప్పినట్టు సమాచారం.

ఈసీని ఎందుకు అడగరు?

ప్రభుత్వానికి రైతులపై ప్రేమ ఉంటే స్పెషల్‌డ్రైవ్‌కు మినహాయింపు ఇవ్వాలని ఈసీకి ఎందుకు లేఖ రాయలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోలింగ్ ముగిసిన తర్వాతైనా ఎందుకు అనుమతి తీసుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. జూన్ 4న ఎన్నికల కోడ్ ముగిసినా స్పెషల్‌డ్రైవ్ మొదలుపెట్టే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నాయి. పెండింగ్ దరఖాస్తులు పరిష్కరిస్తే పెట్టుబడి సాయం తడిసి మోపెడవుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికీ యాసంగి రైతుబంధు పంపిణీయే పూర్తి కాలేదు. ఈ సమయంలో జూన్ చివరి వారం నుంచి వానకాలం పెట్టుబడి సాయం పంపిణీ సాధ్యం కాదు. వీలైనంత ఎక్కువ కాలం దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచాలని సర్కారు భావిస్తున్నట్టు సమాచారం. జూన్ చివరివారంలో 'స్థానిక సంస్థల' ఎన్నికలకు వెళ్తామని ప్రభుత్వం ప్రకటించింది కాబట్టి మరో రెండు మూడు నెలలు 'కోడ్' పేరిట కాలయాపన చేసే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

ప్రతిదానికీ జవాబివ్వలేం

మొదటిపేజీ తరువాయి...

చేసే ఆరోపణల్లో ఒక్క శాతం కూడా నిజం లేదని చెప్పారు. ఆదివారం మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి ధాన్యం టెండర్ల ఆరోపణలపై గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. తాలు, తరుగు పేరుతో రైతుల నుంచి లంచాలు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'మహిళా సంఘాల ఆధ్వర్యంలో 7,200 కొనుగోలు కేంద్రాలు, మూడు వేల మిల్లులు ఉండగా తాము కమీషన్ తీసుకున్నామట. ఇందులో రూ.వెయ్యి కోట్లు నేను తీసుకున్నానట. రూ.100 కోట్లు ఎవరికో పంపిచ్చానట. ఇంతకన్నా పచ్చి అబద్ధం. దుర్మార్గమైన మాట లు మరోటి లేవు. వెంటనే ఈ ఆరోపణలను ఉపసంహరించుకోవాలి' అని అన్నారు.

సన్నబియ్యం కొనలేదు..సన్నవడ్లు కొనలేదు

సన్నబియ్యం టెండర్లలో రూ. 300 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తున్నారని, కానీ ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా సన్నబియ్యం కొనలేదని, ఒక్క గింజ సన్నవడ్లు అమ్మలేదని ఉత్తమ్ తెలిపారు. సన్నబియ్యం కొనుగోలుకు టెండర్ వేసినా, వాటిని నిలిపివేశామని వివరించారు. తమ వద్ద ఉన్న సన్నబియ్యాన్ని మిల్లింగ్ చేసి సరఫరా చేయబోతున్నామని వెల్లడించారు. సన్నబియ్యం టెండర్ల కండీషన్ల ప్రకారం రూ.42 చొప్పున బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఎంత సన్నబియ్యం ఇస్తే అంత కొనుగోలు చేస్తామని తెలిపారు.

మిల్లర్లను కలవటమే తక్కువ

'నేను ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని.. నా నీతి నిజాయతీని 30 ఏండ్లలో ఎవరూ ప్రశ్నించలేదు. నేను రైస్‌మిల్లర్ల నుంచి పైసలు తీసుకోవడం పక్కనపెడితే, అసలు నేను వాళ్లను కలవటమే తక్కువ. వాళ్లు సంఘం ద్వారా వస్తే మాత్రమే కలుస్తాను' అని స్పష్టంచేశారు. 35 ఏండ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నానని, మిల్లర్ల విషయంలో పూర్తి నిబంధనల ప్రకారం వెళ్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని తెలిపారు. తప్పు చేసే మిల్లర్లపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ధాన్యం అమ్మేశాక సర్కారుకేం సంబంధం

టెండర్లద్వారా విక్రయించిన ధాన్యం మిల్లు ల్లో లేదని వస్తున్న ఆరోపణలపై మీడియా ప్రశ్నించగా.. 'మిల్లర్ల వద్ద ధాన్యం ఉందని మా రికార్డుల్లో ఉన్నది. ఎక్కడ, ఎలా ఉన్న ధాన్యాన్ని అలాగే అమ్మేశాం.. ఆ తర్వాత ప్రభుత్వ బాధ్యత ఉండదు' అని తెలిపారు. టెండర్లలో విక్రయించిన ధాన్యం మిల్లర్లు ఇవ్వ టం లేదనే అంశంపై ప్రశ్నించగా..ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని అమ్మేసుకొని, ఆ స్టాక్ ఇవ్వాలని ఇబ్బందిపెడితే ఆ మిల్లర్లపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.గత ప్రభుత్వం ధాన్యాన్ని వేలం వేయగా క్వింటాలుకు రూ. 1,700 ధర వచ్చిందని, తాము వేసిన వేలం లో దొడ్డుర కానికి రూ.2,007 ధర రాగా సన్నరకానికి రూ.2,407 ధర వచ్చిందని వివరించారు.అన్నింటికీ కలిపి సగటు ధర రూ. 2,022 వచ్చిందని తెలిపారు. తద్వారా ప్రభుత్వానికి రూ.1100 కోట్ల అదనపు ఆదాయం వచ్చిందని చెప్పారు. కేంద్రియబండార్ సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది బీఆర్ఎస్ సర్కారేనని, దాన్ని తిరిగి తొలగించిందీ బీఆర్ఎస్ సర్కారేనని తెలిపారు.

మహేశ్వర్‌రెడ్డిని పెంచి పోషించాం

బీజేపీపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చాలా జూనియర్ అని, కొన్ని విషయాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని ఉత్తమ్ అన్నారు. ఆయనను కాంగ్రెస్సే పోషించిందాగా.. అని మీడియా ప్రశ్నించగా జూనియర్ కాబట్టే పెంచి పోషించినం అని మంత్రి సమాధానమిచ్చారు. కిషన్‌రెడ్డిని ఓవర్‌టేక్ చేయాలని, పార్టీలో ఓవర్‌స్పీడ్‌గా ఎదగాలని మహేశ్వర్‌రెడ్డి అనుకుంటున్నారని విమర్శించారు.

పాలనలో పొరపాట్లు : మంత్రి శ్రీధర్‌బాబు

పరిపాలనలో పొరపాట్లు జరుగుతాయని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అందుకే గత ప్రభుత్వాన్ని సలహాలు, సూచనలు ఇవ్వాలని అనేకసార్లు కోరామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసినా సీట్లు రావట్లేదనే అక్కసుతో కాంగ్రెస్‌పై అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని, మార్పునకు అడ్డువస్తే సహించేది లేదని వెల్లడించారు.

గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ఉత్తమ్ డొల్లతనం బయటపడింది: మహేశ్వర్‌రెడ్డి

మంత్రి ఉత్తమ్‌కుమారెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పందించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాటలన్నీ ఉత్త మాటలేనని ఎద్దేవా చేశారు. సివిల్ సప్లై శాఖలో అవకతవకలు జరగటం, రూ.వందల కోట్ల కుంభకోణం జరగటం వాస్తవమని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి తాను ఆధారాలతో సహా ప్రశ్నించిన 19 అంశాలకు మంత్రి ఉత్తమ్ సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారని అన్నారు. ఈ ప్రశ్నలకు సమాధానం దాటవేయడంతోనే మంత్రి డొల్లతనం బయటపడిందని ఎద్దేవా చేశారు. పూర్తి వివరాలను సోమవారం వెల్లడిస్తానని పేర్కొన్నారు.

ఉత్తమ్ తికమక.. మకతిక

- ధాన్యం ఆరోపణలపై పొంతనలేని జవాబులు
- విలేకరుల ప్రశ్నలకు నీళ్లు నమిలిన మంత్రి

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): ధాన్యం, సన్న బియ్యం టెండర్ల ఆరోపణలపై సమాధానం చెప్పలేక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తికమకపడ్డారు. ఆయన మాటలను ఆయనే ఖండించుకోవడం గమనార్హం. మీడియా అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు చెప్పిన ఆయన పలుమార్లు నీళ్లు నమిలారు. తనపై వచ్చిన ఆరోపణలను కప్పిపుచ్చుకునేందుకు నానాతంటాలు పడ్డారనే అభిప్రాయాలు విలేకరుల్లో వ్యక్తమైంది. పైపైకి నవ్వుతూ ఆయన పడిన తిప్పలు చూసి మీడియా ప్రతినిధులు అయ్యో పాపం అనటం గమనార్హం.

ఒక్క సన్న ధాన్యం గింజ అమ్మలేదు

ఫిబ్రవరిలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ధాన్యం టెండర్లలో సివిల్ సప్లై 12వ లాట్‌లో 1.59 లక్షల టన్నుల సన్నధాన్యాన్ని వేలం వేసింది. ఈ ధాన్యాన్ని హిందూస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ క్వింటాలు రూ.2,259కు కొనుగోలు చేసింది. అయితే, సన్నధాన్యాన్ని గింజ కూడా అమ్మలేదని మంత్రి చెప్పారు. అమ్మకపోతే.. ఆయన శాఖ ఆధ్వర్యంలో అమ్మిన ఈ సన్నధాన్యం ఎవరిదో? ఆయనే చెప్పాలి.

టెండర్లు పిలిచాం.. రద్దు చేశాం

గురుకులాలు, హాస్టళ్లు, మధ్యాహ్న భోజనం కోసం అవసరమని ఇటీవల పౌరసరఫరాల సంస్థ 2.20 లక్షల టన్నుల సన్న బియ్యం కొనుగోలుకు టెండర్లు వేసింది. ఈ ట